# పాషాణహృదయం

శ్రీ గ్రంధి అప్పారావు.

ఎక్కణ్ణుంచి వొచ్చేరో గాని కొంతమంది 'యానాది' వాళ్లు గోదావరివొడ్డున గుడిసె వేసుకొని కాపురాలు చేస్తున్నారు. అందులో ఒక ముసలాడు, తన భార్య, ఒకవిధవకూతురు. యిద్దరు మనుమలు ప్రత్యేక కుటుంబం. కూలిపని చెయ్యడం, సున్నపుగుల్ల కాల్చడం, వాళ్ళున్న స్థలానికి అనతి దూరంలోనే వున్న కాష్టాల దిబ్బకి శవాల్ని కాల్చడానికి కర్రలు మోయడం మొదలయినవి వాళ్ల పనులు. ఆ కుటుంబంలో ప్రతివ్యక్తి కూడ కష్టజీవియె కాని వాళ్ల కష్టానికి తగినంత 'కూడు' దేవుడు వాళ్లకి ప్రసాదించలేదు. ప్రతిదినం అర్ధకడుపు భోజనమే కాని కడుపునిండా భోజనం యెప్పుడో కాని వాళ్లకి దొరికేది కాదు. కడుపునిండా భుజించిన నాడే వాళ్లకి భోగిపండుగ పాపం! యెలాగో ఓలాగ వాళ్ళు యీ మాయా జగమనే గ్గానిలో కొట్లాడుతున్నారు.

జూలై నెల ప్రవేశించింది. గోదావరి నది భయంకరంగా ప్రవహిస్తోంది వరదలతో. పెద్ద సర్పంవలె ప్రవహిస్తూ యీ నదీ దేవి చిన్నచిన్న గ్రామాలను పెద్దపెద్ద ధాన్యపు మడులను పొట్టలో పెట్టుకుంటుంది, దున్నలు, ఆవులు, దూడలు- గంధంమానులు, టేకి వృక్షాలు, సామాన్యమైన చెట్లు దూరదేశాలనుండి నదిలో కొట్టుకొస్తున్నాయి.

ముసలాడిగుడిసె పూర్తిగా మునిగిపోయింది. అందులో వున్న కొద్ది సామానంతా గంగపాలై పోయింది. ప్రాణాలు దక్కించుకొని, అతి కష్టం మీద బయట పడ్డాడు ముసలాడు తన సంసారంతో—

కటికి చీకట్లు ఆవరించినయి, హోరని కురుస్తోంది వాన. చలితో వణికిపోతున్నాడు ముసలాడు పిల్లలతో- నిలవడానికి నీడలేదు- తినడానికి తిండిలేదు- మెఱుపులు మెరవడం ఆరంభించినై. ఆ మెరుపుల కాంతి సహాయంతో ఆ ముసలాడు పిల్లల నిద్దరిని చంకలలో నిడుకొని తన భార్యా విధవ కూతుళ్ళతో రుద్రభూమికి బయల్దేరి వెళ్ళి ఒక 'గోళీ'మీద మకాం చేసాడు. వానవల్ల వాళ్లకి అంత బాధ లేదు గాని, హోరున వీస్తున్న చలిగాలి మాత్రం యెముకల్ని కొరికేస్తుంది. అలాగే- అష్టకష్టాలు పడుతు, వాళ్ళు 'యెప్పుడు తెల్లవారుతుందా!' యని దయామయుడగు ఆ భగవంతుని ప్రార్థిస్తూ కూచున్నారు.

తెల్లవారింది. సూర్య భగవానుడు తన సహస్ర కిరణాల్తో ప్రకాశిస్తున్నాడు ముసలాడు పొట్టకోసరం యేమన్నా సంపాదించడానికని బయల్దేరాడు. తన 'సాద' అంతా యే ధనవంతునికైనా చెప్పి నాలుగుడబ్బులు తెచ్చుకొని ఆనాడు గంజి కాచుకొని త్రాగుదామనుకొన్నాడు. కాని పట్నంలో అనుదినం సంచారం చేసే బీద మానవకోటిలో మన ముసలాణ్ణి కనిపెట్టేదెవరు? అతను దీనాతి దీనావస్థలో వున్నాడని యెవరు గ్రహిస్తారు? ఒక్క భగవంతుడు తప్ప. పాపం తాతకి యేమీ తోచింది కాదు. కూలిపని చేయడానికైనా వెళదామనుకొన్నాడు. వర్షపు ముసురుకి వూరంతా బురదగా వుంది. అయినప్పటికి తాతకి ఒక రోజంతా తిండి లేక పోవడంచేత యేమి బరువులు మోస్తాడు!

ముసలాడికి ఒక ఆలోచన తట్టింది. ఒక గెడకర్ర సంపాదించి దాని చివర ఒక కొక్కెం తగిలించి ఆతను గబగబ కాష్టాల దిబ్బకి ప్రక్కనే వున్న నీలాటి రేవుకి పోయి అందులో దిగాడు. అతను తన సాయ శక్తుల కష్టపడి దూరాన్నుంచి పోతూన్న పుల్లల్ని గెడకర్రతో లాగేవాడు, దగ్గర్నుంచి పోతున్న వాటిని తన నిడుపాటి చేతుల్తో లాగేవాడు. సాయంత్రం అయ్యేటప్పటికి అతను చెమటూర్చి ఒక బండి పుల్లల్ని మేటుగా వేసాడు.

ముసలాడికి అతని కుటుంబానికి నిన్నను తిండిలేదు. ఈవాళంతా కూడా పస్తే. గోళీ' దగ్గర పిల్లలు మలమల మాడిపోతున్నారు. ఇంత కష్టంలో వున్నప్పటికి ముసలాడు ధైర్యం వొదలలేదు. అధమపక్షం ఒక రూపాయి అయినా వస్తుందని

అంచనా వేసాడు పుల్లలికి. 'గోదారి తల్లే మింగేసింది నాగుడిసెన, నా గుడిసెలోనున్న కుండా మండా నా గోదావరి తల్లే మింగేసింది. ఆ గోదారి తల్లే యియ్యాళ నాకు కూంత కూడెడుతుంది.—— పుల్లలిచ్చింది నాకు- నాతల్లి అందరికంటే నాకే యెక్కువిచ్చింది' అనుకుంటూ ముసలాడు సంబర పడిపోతున్నాడు కష్టపడి యేరిన పుల్లల మేటు కేసి చూస్తో.

సాయంత్ర మూరుఘంటలయింది. రొజగాలి కొడు ...ంది. నదీదేవి హొూరని ప్రవహిస్తూంది. వెల్లువలై పారుతున్న నదిని చూడ్డానికి చాలా మంది స్త్రీ పురుషులు గట్టుమీాది కొచ్చారు.

పుల్లలు కొనడానికెవరో వచ్చారు. వాటి ధర అడిగేరు. 'రూపాయి' అని చెప్పాడు తాత. రూపాయి ముసలాడిచేతులో పెట్టి పుల్లల్ని పట్టించు కెళ్లారా పెద్ద మనుష్యులు.

ముసలాడి చేతులో రూపాయి పడింది. తన కష్టం వృథాగా పోలేదనుకొంటూ రూపాయిని మొలను దోపుకొని చిరునవ్వు నవ్వుకున్నాడా జీవుడు. ఆరాత్రి కడుపునిండా కూడు తిని, కంటినిండా నిదురబోదామని తలంచేడు అలసిపోయిన ఆ మానవుడు. పొట్ట మలమల మాడిపోతున్నప్పటికి, సడలిపోయిన ఆవృద్ధ నరములు లాగుకొని పోతున్నప్పటికి అతని ముఖంలో గొప్పకాంతి తేజోవంతంగా ప్రకాశిస్తూంది తృప్తిని సూచిస్తూ.

౨

కారు మేఘాల్తో ఆవరించియున్న అతని జీవితాకాశంలో చిన్న మెరుపొకటి మెరసి అంధకారాన్ని మరింత గాఢంగా చేసింది.

'ఏయ్!-తాతా! ఎంత కమ్మేవు-మేటు? అని సంభోదించా డొకాయన కాకీనిక్కరు, పొట్టిచేతుల చొక్కా, వాని దుస్తులు. ఒకచేతిలో కర్ర యింకోచేతులో బేటరీలైటు వుంది ఆయనకి.

'ప్రభువులోరికి అబద్దం చెప్పడం యెందుకండీ. ఒకరూపాయి కమ్మేనండి బాబు. రెండు రోజుల్నుండి పస్తడివున్న మా పొట్టలకి యింత కూడు దొరుకుతాది బాబు యియ్యాళ మీా దయావల్ల-

'గోదాట్లో కలప నిన్నెవడు తీయమన్నాడు? తీస్తే శిక్షవుందని తెలీదూ. ఏంరా మాటాడవు. పద స్టేషన్ కి. కోట్లో కూచుందువుగాని ముందుగా నీ పేరుచెప్పు. ఊ-'అని ధాంధూం చేసాడాయన.

'బాబూగారూ చమించండి. మీారే నాకు తల్లి దండ్రి. ఇల్లువాకిలి లేనోణ్ణిబాబు. యీ నాదోణ్ణి నా గుడిసె గోదాట్లో కొట్టుకు పోయింది నాయనా. పిల్లలు, వాళ్ళు, గోళీ దగ్గరున్నారు బాబు. తిండిలేక చచ్చి పోతున్న మా ప్రాణాల్ని నిలబెట్టండి ప్రభువులు. కొంచెం కనికరం చూపించు బాబు. చచ్చిపోయి నీకడుపు నపుడతాను తండ్రీ. అయిదుగురు ప్రాణాలు రచ్చించిన వాడవగుతావు. ప్రాణదానం చెయ్యిబాబు. నన్ను కొట్లోయేస్తే నాయాడోళ్లకి-పిల్లలకి దిక్కేది? చమించు బాబు'

అని ముసలాడు గోడుగోడున దుఃఖిస్తూ వాని కాళ్ళు పట్టుకొన్నాడు-

'ఛా! ఛా! నోరుముయ్యి. బుద్ధి లేదు ముసలోడా! నాకాళ్ళు పట్టుకొంటావ్. నా చేతిలో యేముందో చూసావా?'

ముసలాడు భయంతో లేచి నిలబడి గజగజ వణకిపోతున్నాడు పాపం.

'ఇంతగా గోలెడుతున్నావు కాబట్టి నిన్ను క్షమించేను. ఆ రూపాయ, యిలాగియ్యి సిన్నోదిలేస్తాను.' అన్నాడా వ్యక్తి

హారిహారీ! ఆ ముసలాడి దీనాలాపాలికి ప్రక్కనున్న రాళ్ళుకూడ కరిగిపోతున్నట్టు కనిపించేయి. కాని ఆ వ్యక్తి హృదయం మాత్రం కొంచెం అయినా చలించలేదు. అది యేమి హృదయమోగాని..

ముసలాడు దేనిమీాద తనపంచప్రాణాన్ని నిలబెట్టుకొన్నాడో, ఏది తన పిల్లల పొట్టలనింపి లేత హృదయాలికి ఆనందం కూర్చుకుందనుకొన్నాడో, దేనినైతే పిక్షించినంత మాత్రాన పాములనాస పాటవిన్న నాగేంద్రుడులా పొంగిపోయాడో, దేని స్పర్శమాత్రాన తన గుంటకళ్లు తేజోవంతంగా ప్రకాశించాయో-దానిని- ఆ రూపాయిని- చిరునవ్వుతో మొలలో దోపుకున్న ఆ రూపాయిని, వణకుతున్న హస్తాన్ని మొలలోనికి పోనిచ్చి తీయలేక తీయలేక తీసి, ఆ పాషాణ హృదయుని చేతిలో బెట్టి-

'చమించుబాబు, మెరక్క చేసానండి తప్పు. అందరు తీస్తున్నారని తీసేనుబాబు- తప్పని తెలియలేదు బాబు' అని వానికాళ్ళకు సాష్టాంగ పడ్డాడు-

'చూసేను కాదు మరి, వాళ్ళని-గుడ్లు పీకెయ్యక పోయానా' అన్నాడు ఆ వ్యక్తి.

'చమించు బాబు కూడుకోసం-పొట్టబాధ- భరించడం కష్టం- వాళ్ళ నేమనకు బాబు' అన్నాడు భయపడుతూ-

'సరే! వెళ్ళు యిలాంటి పను లెప్పుడు చేయకు పో!' అని పలుకుచు యేదో విధమయిన కనికరం అతని మీద ప్రసరించి నట్టుగా తలస్తూ అతను అతి గర్వంగా వెళ్ళి పోయాడు.

రాత్రి యెనిమిది ఘంటలు కావచ్చింది-

తుపాను గాలిలా వచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక ముసలాడు బావురుమని యేడుస్తూ యెడమ చేత్తో నెత్తి నోరు కొట్టుకొంటు నీరసంగా, నడవలేక నడవలేక దారి పట్టాడు కాష్టాల దిబ్బల వైపు.


# అయఃకాంత ద్రావకం



ధాతువృద్ధికి సేవింపదగినది ద్రావకము ఇనుము. ఇనుము తిన్నవారికి నీరసము, ముసలితనము లేదని అగస్త్యాదులు వచించియున్నారు. కావున దీనిని సేవించుటచే భీమబలము సిద్ధించును.

ద్రావక సేవనమువలన గలుగు గుణములు.

ఉష్ణముచే వెంట్రుకలు రాలుకుండ ఆగును, కాలుచేతులు, కండ్లమంటలు పోవును, ముఖమునకు తేజస్సు నిచ్చును, వాతమును, ఉష్టమును పోగొట్టును, కాళ్ళు చేతుల దుర్బలము నణచి నొప్పును పోగొట్టును ఆకలిని జీర్ణశక్తిని కలిగించును. సడలిన నరములకు సత్తువ జేయును గుల్మము, గుండెనొప్పి కలవారు ఈ అయఃకాంత ద్రావకమును 8 రోజులు సేవించిననే జాలును ధాతుపుష్టి లేని వారు 40 రోజులు సేవించిన జాలును.

(అర్ధ మండలం) 20 రోజులకు మందు 1-0-0.

(1 మండలం) 40 రోజులకు వచ్చుమందు 1-12-0.

ఆర్యా బుక్ డిపో,

తిరువళ్ళిక్కేణి, మదరాసు.